క్లుప్తంగా

భక్తులతో పోటెత్తిన ఖాద్రీ



ఖాద్రీశుడి దర్శనానికి క్యూలైన్‌లో నిలబడిన భక్తులు

కదిరి టౌన్‌: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ఖాద్రీశుడిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులకు భక్తులకు ప్రసాదం అందజేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

జిల్లాలు దాటిన వలంటీర్‌ సేవలు



తిరుపతిలో పింఛన్‌ అందజేస్తున్న వలంటీర్‌ రాజు

కదిరి టౌన్‌: మున్సిపల్‌ పరిధిలోని 35వ వార్డులో నివాసం ఉంటున్న శ్రీనివాసులు అనారోగ్యంతో కొన్ని రోజులుగా తిరుపతి రుయా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వార్డు కౌన్సిలర్‌ రంగారెడ్డి సూచనలతో వలంటీర్‌ రాజు శనివారం సొంత ఖర్చులతో తిరుపతి వెళ్లాడు. రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాసులుకు పింఛన్‌ అందజేశాడు. వలంటీర్‌ సేవలను పలువురు అభినందించారు.

వైద్య సేవలు అందుతున్నాయా?



రెక్కమానులో రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా

గాండ్లపెంట: కురుమామిడి పంచాయతీ రెక్కమాను గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్‌ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. వైద్యులు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. వైద్య సేవలు ఎలా అందుతున్నాయని రోగులను ఆరా తీశారు. రక్తపోటు, చక్కెర వ్యాధిగ్రస్తులకు అవసరమైన పరీక్షలు చేసి మాత్రలు అందిస్తున్నారని పలువురు బదులిచ్చారు. అనారోగ్య తీవ్రతను బట్టి ఇతర ఆస్పత్రులకు రెఫర చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఫ్యామిలీ కాన్సెప్ట్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి మహేశ్వర మారుతి, సూపర్‌వైజర్‌ ఉపేంద్రారెడ్డి, సీహెచ్‌ఓ, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



మృతుడి తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న కేతిరెడ్డి వెంకట కృష్ణారెడ్డి

తాడిమర్రి: మండలంలోని భీమరాయునిపేట గ్రామానికి చెందిన కుంచపు రాజ్‌ కుమార్‌ కుటుంబానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి సోదరుడు, యువనేత వెంకట కృష్ణారెడ్డి శనివారం ఆర్థికసాయం అందించారు. కుంచపు రామకృష్ణ, ఆదిలక్ష్మి దంపతుల కుమారుడు రాజ్‌ కుమార్‌ గత ఏడాదిగా కడప పట్టణంలోని శ్రీచైతన్య జూనియర్‌ కళాశాలలో ఉద్యోగం చేస్తుండేవాడు. గత నెల 26న అతను నివాసం ఉంటున్న ఇంట్లో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. నాలుగు రోజుల పాటు వైద్య చికిత్స పొందిన రాజ్‌ కుమార్‌ కోలుకోలేక మృతి చెందాడు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుల ద్వారా సమాచారం అందుకున్న ఎమ్మెల్యే బాధిత మృతుని తల్లిదండ్రులను ధర్మవరం పిలుపించుకుని రూ.20 వేలు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పూలకుంట చంద్రబాబు, వాలంటీర్‌ రాజశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



సరోజమ్మ

తలుపుల: మండల కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన సరోజమ్మ (43) రెండు రోజుల నుంచి కనపడటం లేదని పోలీస్‌ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. ఎస్‌ఐ ఎస్‌ఐ మగ్బుల్‌ బాషా తెలిపిన వివరాలు.. ధర్మవరం మాల్యవంతం చెందిన సరోజమ్మను ఏపులపల్లికి చెందిన మల్లికార్జునకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి మైత్రి, మధుప్రియ ఇద్దరు కుమార్తెలు కలరు. మూడు నెలల నుంచి గాంధీనగర్‌లో నివాసం ఉంటున్నారు. సరోజమ్మ అన్న నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి

- టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మకండి
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి





డ్వాక్రా సంఘాల సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మామిళ్లపల్లిలో జరిగిన వైఎస్సార్‌ ఆసరా సంబరాల్లో పాల్గొన్న మహిళలు

కనగానపల్లి: త్వరలో జరగనున్న ఎన్నికల్లో అక్కచెల్లెమ్మల అమూల్యమైన ఓటుతో జగనన్నను మరోమారు ఆశీర్వదించి, సీఎం చేసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని కనగానపల్లి, యలకుంట్ల, తగరకుంట, మద్దెలచెరువు, చంద్రాశ్చర్ల, మామిళ్లపల్లి గ్రామాల్లో జరిగిన వైఎస్సార్‌ ఆసరా సంబరాల్లో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటలకు వరకు జరిగిన ఈ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున్న మహిళలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మహిళలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం సీఎం వైఎస్‌ జగన్‌ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలి..

వైఎస్సార్‌ ఆసరా సంబరాల సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామ సభల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు సంబంధించిన రూ.25,500 కోట్ల డ్వాక్రా రుణాలన్నీ నాలుగు విడతల్లో మాఫీ చేశారన్నారు. దీంతో పాటు సున్నా వడ్డీ పథకం మరో రూ.5,500 కోట్లు డ్వాక్రా మహిళల పొదుపు ఖాతాల్లో జమ చేశారన్నారు. వీటితో పాటు అమ్మఒడి, వైఎస్సార్‌ చేయూత పథకాల ద్వారా సుమారు రూ.2.5 లక్షల కోట్లు మహిళ ఖాతాల్లో జమ చేశారన్నారు. పలుమార్లు బటన్‌ నొక్కి నేరుగా మీ బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేసిన జగనన్నకు మరోమారు ఓటు వేసి ఆశీర్వదించాలన్నారు.

నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేశాం..

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రామాల్లోకొచ్చి మాయ మాటలు చెపుతున్న టీడీపీ నాయకులను నమ్మొద్దని ప్రజలకు ఎమ్మెల్యే సూచించారు. 2014 ఎన్నికల ముందు చంద్రబాబు 600 అబద్ధపు హామీలు ఇచ్చి.. ఆ తర్వాతా అధికారంలోకొచ్చాక ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. దీంతో 2019లో అధికారం కోల్పోయిన ఆయన మరోమారు అబద్ధపు హామీలతో ప్రజలకు ముందుకు వచ్చి మోసం చేయాలని చూస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన వంద రోజులకే పేరూరు డ్యాంకు కృష్ణా జలాలను తెచ్చి, రాప్తాడు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేశామన్నారు. పీఏబీఆర్‌ ద్వారా నియోజకవర్గంలోని పలు గ్రామాలకు తాగునీటి సౌకర్యాన్ని కల్పించామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 25 వేల మంది మహిళలకు ఇళ్లు, స్థలాలు మంజూరు చేయించటంతో పాటు 50 వేల మందికి పింఛన్లు, 2 వేల మంది రైతులకు బోర్లు వేయించామన్నారు. 25 ఏళ్ల పాటు ఈ ప్రాంతంలో ఎమ్మెల్యేలు, మంత్రులుగా కొనసాగిన పరిటాల కుటుంబ సభ్యులు ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ కాంత్రి పథకం ఏసీ రామేశ్వరరెడ్డి, ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్‌, మండల అగ్రి బోర్డు చైర్మన్‌ వెంకటరాముడు, సొసైటీ అధ్యక్షుడు భాస్కర్‌, డైరెక్టర్‌ ప్రభాకర్‌, ఏపీఎం హేమలత, ఈఓఆర్డీ అనిల్‌కుమార్‌, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ అమరనాథరెడ్డి, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం చెండ్రాయునిపల్లి సచివాలయ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న నేషనల్‌ హైవే 343 రోడ్డు విస్తరణలో భాగంగా నివాస గృహాలను కోల్పోయిన వారికి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. పుట్టపర్తి పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ న్యాయం జరుగుతోందన్నారు. లక్షలాది మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేసి ఇళ్లను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిద్దరాంపురం సర్పంచ్‌ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు సీసీ, తారు రోడ్ల ప్రారంభం

తలుపుల: మండలంలోని యర్రసానిపల్లి, కొరుగుట్టుపల్లి, దిగువ బైగారిపల్లి, చెరువుమరవపల్లిలో నిర్మించిన తారు రోడ్లు, సీసీ రోడ్డు, బ్రిడ్జిని ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తున్నట్లు కన్వీనర్‌ ఫయాజ్‌ అహమ్మద్‌, జేసీఎస్‌ కన్వీనర్‌ టోపీ రమణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్‌ పీవీ సిద్దారెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

మారుమూల గ్రామాలకు తారురోడ్లు

- ఎమ్మెల్యే డాక్టర్‌ పీవీ సిద్దారెడ్డి
- రూ.2.63 కోట్లతో వేసిన తారురోడ్ల ప్రారంభం



గాండ్లపెంట: శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్‌ పీవీ సిద్దారెడ్డి

గాండ్లపెంట: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి పాలనలో మారుమూల గ్రామాలకు సైతం తారు రోడ్లను వేశామని ఎమ్మెల్యే డాక్టర్‌ పీవీ సిద్దారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని నీరుకుంట్లపల్లి నుంచి తుమ్మలబైలు వయా గొడ్డువెలగల వరకూ రూ.172 లక్షలతో నిర్మించిన 3 కిలోమీటర్ల తారు రోడ్డును ప్రారంభించారు. అలాగే మునగలవారిపల్లి నుంచి ఎనుములవారిపల్లి వయా కురుమామిడి వరకూ రూ.191 లక్షలతో 3 కిలోమీటర్లు వేసిన తారు రోడ్డును నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దశాబ్దాలుగా సరైన రహదారిలేక ఇబ్బంది పడుతున్న గ్రామీణ ప్రాంతాలకు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి నాయకత్వంలో రోడ్లు వేయించామన్నారు. టీడీపీ పాలనలో నాయకులు గ్రామాల్లో ఏనాడు కూడా గంపెడు మట్టి వేసిన దాఖలాలు లేవన్నారు. 30 సంవత్సరాలుగా జరగని అభివృద్ధి కేవలం నాలుగున్నర సంవత్సరాల్లో జరిగిందన్నారు. అభివృద్ధి జరిగినా ఓర్వలేక అబద్ధాలతో ప్రభుత్వంపై బురదచల్లే కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం ఎవరి పాలనలో జరిగిందో ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. సరైన సమయంలో టీడీపీకి బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు చవ్వా శ్రీనివాసరెడ్డి, రాజా, ఉత్తన్న, జిరాక్స్‌ రాజారెడ్డి, ఎంపీపీ తాతం జగన్మోహన్‌, కన్వీనర్‌ గజ్జల రవీంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రవీంద్రానాయక్‌, గొడ్డువెలగల, తుమ్మలబైలు సర్పంచులు జి.ఆంజనేయులు, ఏ.ఆంజనేయులు, సొసైటీ అధ్యక్షుడు ఎస్సీ హైదర్‌వలీ, ఆర్బీకే అధ్యక్షుడు శంకర్‌నాయుడు, సచివాలయ కన్వీనర్లు నాగార్జునరెడ్డి, ప్రతాపరెడ్డి, లోకేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం కావాలంటే మళ్లీ జగనన్నే రావాలి

ఎన్‌పీకుంట: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నకే పట్టం కట్టాలని ఎమ్మెల్యే డాక్టర్‌ పీవీ సిద్దారెడ్డి కోరారు. శనివారం మండల పరిధిలోని ఎదురుదోన పంచాయతీ కేంద్రంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని నాయకులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థతో గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ పరిపాలన మరింత చేరువైందన్నారు. అనంతరం సచివాలయ నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసిన నిర్మాణ సహాయకులు ఎద్దుల కేశవ, ఇంజినీరింగ్‌ అసిస్టెంట్‌ ధనుంజయరెడ్డిని సత్కరించారు. విలువైన భూమిని సచివాలయానికి విరాళంగా అందించిన స్థలదాతలు కె.గంగాద్రి, పి.శంకరను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాము, సర్పంచ్‌ నాగమునీశ్వర నాయుడు, సర్పంచ్‌ విష్ణుమూర్తి, జేసీఎస్‌ కన్వీనర్‌ ఆదినారాయణరెడ్డి, వాటర్‌షెడ్‌ చైర్మన్‌ బయారెడ్డి, మార్కెట్‌యార్డ్‌ డైరెక్టర్‌ పురుషోత్తం రెడ్డి, బీసీ సెల్‌ కన్వీనర్‌ ఆదెప్ప నాయుడు, సచివాలయ కన్వీనర్‌ ఎద్దుల గౌరమ్మ, కేశవ, సిద్దారెడ్డి, డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ రెడ్డి, గ్రామ కన్వీనర్లు సాంబ, రామకృష్ణ, రంగారెడ్డి, కేశవరెడ్డి, రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, విజయారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాజేంద్ర పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పుట్టపర్తి: బుక్కపట్నంలోని న్యూ ఎస్సీ కాలనీకి చెందిన కటారి రాము కుమారుడు రాజేష్‌ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీలు పార్వతి రత్నాకం, పద్మావతి ఈశ్వర్‌, మండల మైనార్టీ కన్వీనర్‌ ఖదీర్‌, బూత్‌ లెవెల్‌ మేనేజర్‌ పతాంజలి, నీలూరి ఈశ్వర్‌, అగ్రహారం బాబు తదితరులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ.8 వేల ఆర్థికసాయం అందజేశారు. అధైర్యపడొద్దు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

నల్లమాడ: గోపేపల్లి తండాకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త దేవళానాయక్‌కు నల్లమాడకు చెందిన ఆ పార్టీ నాయకుడు టీడీ క్రిష్ణసుమన్‌రెడ్డి రూ.30 వేలు ఆర్థికసాయం అందజేశారు. దేవళానాయక్‌ మాట్లాడుతూ.. ఇంటి నిర్మాణం కోసం ఆర్థికసాయం చేయాలని క్రిష్ణసుమన్‌రెడ్డిని కోరినట్లు తెలిపాడు. స్పందించి ఆయన సోదరుడు టీడీ కేశవరెడ్డి ద్వారా రూ.30 వేలు సమకూర్చడం జరిగిందన్నారు.

యువతిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు

కదిరి టౌన్‌: యువతిని వేధిస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ బాబ్జాన్‌ తెలిపారు. వివరాలు..మున్సిపల్‌ పరిధిలోని కుటాగుళ్లకు చెందిన యువతిని అదే గ్రామానికి చెందిన ఉదయ్‌కుమార్‌రెడ్డి రోజూ వేధిస్తున్నాడు. దీంతో శనివారం బాధితురాలు కదిరి డీఎస్పీ శ్రీలతను ఆశ్రయించింది. తన గోడు వెళ్లబోసుకుంది. సీఐ ఆదేశాలతో నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్‌ అపహరణ

నల్లచెరువు: స్థానిక హెచ్‌పీ పెట్రోల్‌ బంకు వద్ద పార్కింగ్‌ చేసిన ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారని తనకల్లు మండలం కొక్కంటి గ్రామానికి చెందిన బయన్న తెలిపాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. నల్లచెరువుకు సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్‌ బంకు వద్ద శుక్రవారం ట్రాక్టర్‌ను పార్కింగ్‌ చేశాడు. శనివారం ఉదయం వెళ్లి చూడగా కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నేడు బసంపల్లిలో వైఎస్సార్‌ సంబరాలు

కనగానపల్లి (చెన్నేకొత్తపల్లి): చెన్నేకొత్తపల్లి మండలంలోని బసంపల్లి గ్రామంలో వైఎస్సార్‌ ఆసరా సంబరాలు ఆదివారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ నర్సిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన జరిగే ఈ సంబరాల్లో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తాం



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో సమన్వయకర్త బీఎస్‌ మక్బూల్‌ అహ్మద్‌



మాజీ సమన్వయకర్త ఎస్‌ఎండీ ఇస్మాయిల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మక్బూల్‌ అహ్మద్‌

- సమన్వయకర్త బీఎస్‌ మక్బూల్‌ అహ్మద్‌

కదిరి టౌన్‌: రానున్న ఎన్నికల్లో కదిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామని సమన్వయకర్త బీఎస్‌ మక్బూల్‌ అహ్మద్‌ స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని 14వ వార్డు నిజాంవలీ కాలనీకి చెందిన టీడీపీ నాయకులు ఈదుల్లా, అబ్దుల్‌, నూర్‌ మహమ్మద్‌, మహ్మద్‌, సమీవుల్లా, సాధిక్‌, సాబిర్‌, బాబాజాన్‌, ఏజాజ్‌తో పాటు దాదాపు 25 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా సమన్వయకర్త బీఎస్‌ మక్బూల్‌ అహ్మద్‌ వారికి కండువాలు సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అందరూ కలిసికట్టుగా పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను వలంటీర్లు ఇంటి ముంగిటకే అందజేస్తున్నారు. సంక్షేమ పథకాలు పార్టీ విజయానికి దోహదపడుతాయన్నారు. పార్టీ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానని పేర్కొన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త ఎస్‌ఎండీ ఇస్మాయిల్‌, లాయర్‌ ఫజులుల్లాను దుశ్శాలువాలతో సన్మానించారు.

నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణం



మాట్లాడుతున్న ఎంవీఐ వరప్రసాద్‌

బత్తలపల్లి: డ్రైవర్ల అజాగ్రత్త వల్లనే రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని కదిరి మోటార్‌ వెహికల్‌ ఇన్‌స్పెక్టర్‌ వరప్రసాద్‌ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీజ్యోతి హైస్కూల్‌లో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ.. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాలపై డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు వాహనాల మీద మోజుతో అతివేగంగా నడపడం, హెల్మెట్‌ లేకుండా సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నట్లు వివరించారు. శ్రీజ్యోతి హైస్కూల్‌ కరస్పాండెంట్‌ మిడతల ధర్మతేజ మాట్లాడుతూ.. నిర్లక్ష్యంగా నడపడం, ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించక ఓవర్‌టేక్‌ చేయడం వల్ల ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నట్లు వివరించారు. అతివేగం ప్రమాదమని.. భద్రతా నియమాలు పాటిస్తే మిమ్మల్ని రక్షించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరాముడు, నాగపెద్దిరాజు, కాటమయ్య, శంకరయ్య, రాజశేఖర్‌, కానిస్టేబుల్‌ సురేష్‌, భాషా, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయండి

బత్తలపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ధర్మవరం డీఎస్పీ టి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఎస్‌ఐ పి.శ్రీనివాసులు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ధర్మవరం రూరల్‌ సీఐ ఆరోహణరావుతో వాహనాల తనిఖీని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్‌ విడుదల అయ్యే అవకాశం ఉందన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు తమ పరిధిలో వాహనాల తనిఖీలు, నిఘా పెంచాలని సూచించారు. అక్రమంగా మద్యం రవాణాతో పాటు ఇతరత్రా వాటిపై దృష్టి సారించాలని తెలిపారు. ఇదే సమయంలో ప్రమాదాల నివారణకు డ్రైవర్లకు సూచనలు అందించాలన్నారు. ఏఎస్‌ఐ సోమశేఖర్‌మూర్తి పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీలత

కదిరి టౌన్‌: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలని కదిరి డీఎస్పీ శ్రీలత సూచించారు. శనివారం పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో పట్టణ సీఐ పుల్లయ్య అధ్యక్షతన బంగారు షాపు యజమానులు, దుకాణదారులకు ట్రాఫిక్‌ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్‌ పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మార్కెట్‌, చౌక్‌ బజారు, ఇక్బాల్‌ రోడ్డు, శివాలయం, దేవాలయం బజారు, వలీసాబ్‌ రోడ్డు, కోనేరు సర్కిల్‌, జీవిమాను సర్కిల్‌లో ట్రాఫిక్‌ ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. రాత్రి పూట లోడింగ్‌, అన్‌లోడింగ్‌ చేసుకోవాలన్నారు. ఇక్బాల్‌ రోడ్డులో దుకాణాల ముందు రెండు వైపులా ద్విచక్ర వాహనాలను పార్కింగ్‌ చేయొద్దని సూచించారు. ఇక్బాల్‌ రోడ్డు, దేవాలయం బజారు, శివాలయం, మార్కెట్‌లో వన్‌వే ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకు దుకాణదారులు సహకరించాలన్నారు. మార్చి నెలలో ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. ట్రాఫిక్‌కు విరుద్ధంగా ఎక్కడపడితే అక్కడ ద్విచక్ర వాహనాలు నిలుపరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐ బాబ్జాన్‌, సేవాభారతి అధ్యక్షుడు చెన్నరాయశెట్టి, ఆర్యవైశ్య సంఘం నాయకులు, బంగారు షాపు దుకాణాదారులు పాల్గొన్నారు.

గాజేఖన్‌పల్లిలో స్పెయిన్‌ దేశస్తుల పర్యటన



మాట్లాడుతున్న స్పెయిన్‌ దేశస్తులు

నల్లచెరువు: మండల పరిధిలోని గాజేఖన్‌పల్లి గ్రామంలో శనివారం స్పెయిన్‌ దేశస్తులు పర్యటించారు. ఈ సందర్భంగా గత 12 సంవత్సరాలుగా గ్రామంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. స్కూలు, పలువురికి పక్కా గృహాలను నిర్మించారు. నీటి సౌకర్యం కల్పించారు. పలువురు పేద పిల్లలను దత్తత తీసుకొని వారి తల్లి దండ్రుల ప్రమేయం లేకుండా పిల్లలకు 18 సంవత్సరాల వయస్సు వచ్చే వరకూ చదువులకు ఏటా వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశారు. తమకు సహాయం చేసిన స్పెయిన్‌ దేశస్తులు గ్రామానికి రావడంతో ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్పెయిన్‌ దేశస్తులు గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహించారు. ఆర్డీటీ ద్వారా గ్రామస్తులు పొందిన లబ్ధిని వివరించారు.

సంక్షిప్త సమాచారం

ద్విచక్ర వాహనాల ఢీ: ముగ్గురికి గాయాలు



గాయపడిన లోకేష్‌ ఆచారి

ముదిగుబ్బ: మండల కేంద్రానికి సమీపంలోని కాకతీయ డాబా వద్ద శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముదిగుబ్బకు చెందిన లోకేష్‌ ఆచారి, నల్లమాడ మండలం రెడ్డిపల్లి మీసాలపల్లి గ్రామానికి చెందిన ఆసీఫ్‌, హరి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లోకేష్‌ ఆచారికి కాలు విరిగింది.

నేడు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

అమడగూరు: మండల వ్యాప్తంగా ఆదివారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎలక్ట్రికల్‌ ఏఈ చంద్రానాయక్‌ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కుటాగుళ్ల నుండి వచ్చే విద్యుత్‌ మెయిన్‌ లైన్‌లో మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్‌ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

తనకల్లు: మండల పరిధిలోని పెద్దపల్లి క్రాస్‌ వద్ద అక్రమంగా తరలిస్తున్న 115 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్‌ శనివారం తెలిపారు. గండోడివారిపల్లికి చెందిన సూర్యనారాయణ కర్ణాటకలోని చాకివేలు నుంచి మద్యం తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పెద్దపల్లి క్రాస్‌ వద్ద నిందుతుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందుతుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

ఏడీసీసీ బ్యాంక్‌లో సత్వర సేవలు



సంబరాలు చేసుకుంటున్న బ్యాంక్‌ సిబ్బంది

ధర్మవరం రూరల్‌: ధర్మవరం ఏడీసీసీ బ్యాంక్‌లో శనివారం బ్యాంక్‌ సిబ్బంది వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. 106వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా కేక్‌ కట్‌ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బ్యాంక్‌ మేనేజర్‌ నాగార్జున మాట్లాడుతూ.. ఈ బ్యాంక్‌లో ఈ-స్టాంప్‌లు లభిస్తాయన్నారు. అదనపు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు, సత్వర సేవలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌ మేనేజర్లు పురుషోత్తం, నాగవేణి, రహంతుల్లా, సిబ్బంది ప్రేమ్‌కుమార్‌, సునీల్‌ కుమార్‌, లక్ష్మీప్రసన్న, సీఈఓలు నారాయణ స్వామి, దామోదర్‌, నరసరామ్‌, మహేష్‌, పృథ్వీనిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ డైరీ, క్యాలెండర్‌ ఆవిష్కరణ

కనగానపల్లి: మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో వద్ద శనివారం పీఆర్‌టీయూ నాయకులు డైరీ, క్యాలెండర్‌ ఆవిష్కరించారు. ఎంఈఓలు అరుణమ్మ, శ్రీదేవి చేతుల మీదుగా వీటిని ఆవిష్కరించి ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు రంగారెడ్డి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివలింగం, నంది విగ్రహాల బహూకరణ



శివలింగం, నంది విగ్రహాలను ఆలయ కమిటీ సభ్యులకు అందించిన దృశ్యం

ఎన్‌పీకుంట: మండల పరిధిలోని తిమ్మమాంబ ఆలయానికి శివలింగం, నంది విగ్రహాలను తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన పెద్ద వెంకటేశు బహుకరించారు. శనివారం పెద్ద వెంకటేశు కుటుంబ సభ్యులతో కలిసి తిమ్మమ్మ మర్రిమానును సందర్శించారు. తిమ్మమాంబ ఆలయంలో బాలవీరయ్య, తిమ్మమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ విగ్రహాలను మాఘమాసంలో తిమ్మమ్మ కోట వద్ద ఉన్న ఆలయంలో ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సర్పంచ్‌ విష్ణుమూర్తి, అనిల్‌ రాయల్‌, పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

తాడిమర్రి: తాడిమర్రి, చిల్లకొండయ్యపల్లి, మరవపల్లి, నిడిగల్లు, పుల్లానారాయణపల్లి తదితర గ్రామాల్లోని చిన్నారులకు శనివారం వైద్య సిబ్బంది వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం వైఎస్సార్‌ హెల్త్‌ క్లీనిక్‌ల్లో.. ప్రతి శనివారం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు బీసీజీ, ఎంఎమ్మార్‌, డీపీటీ, నిమోనియా, పెంటా, హెపటైటీస్‌ బీ తదితర టీకాలు వేస్తామన్నారు.

లక్ష్మీనృసింహుడికి పూజలు

తాడిమర్రి: మండలంలోని ఏకపాదంపల్లి, నార్శింపల్లి గ్రామాల్లోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయాలు, తాడిమర్రిలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయాల్లో శనివారం భక్తుల సందడి నెలకొంది. ముందుగా ఆయా ఆలయాల్లో ఆలయ పూజారులు స్వామి మూలవిరాట్‌లకు వెండి ఆభరణాలు తొడిగి, పూలమాలలతో అందంగా అలంకరించారు. పంచామృతాభిషేకం, అభిషేకం, కుంకుమార్చన చేపట్టారు.